క్లుప్తంగా

జోరుగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు



బెండపూడిలో ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి

తొండంగి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో పేదల ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జోరుగా సాగుతోంది. బెండపూడిలో ఇళ్లపట్టాల రిజిస్ట్రేషన్‌ను బుధవారం తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి పరిశీలించారు. గ్రామ సచివాలయ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. పారదర్శకంగా, త్వరితగతిన రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. నూటికి నూరుశాతం ఇళ్లపట్టాలను రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ గెట్టం వెంకటేశ్వరరావు, వీఆర్వోలు సత్యనారాయణ, బి.సత్యనారాయణ ఉన్నారు.

మహిళలకు గ్యాస్ కనెక్షన్ల పంపిణీ



జగ్గంపేటలో ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న ఒమ్మి రఘురాం

జగ్గంపేట: పేదల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. జగ్గంపేటలోని ప్రధాన మంత్రి ఉజ్వల పథకానికి చెందిన 50 మంది లబ్ధిదారులకు బుధవారం ఆయన గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నేతలు కిలపర్తి వీరబాబు, నీలపల్లి అప్పారావు, దత్తి శ్రీనివాస్, రెడ్డి భానుప్రతాప్, పచ్చిపులుసు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ సేవలు



చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు సోమేశ్వరరావు

కోటనందూరు: స్థానిక నాన్‌భవిత కేంద్రంలోని దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్యం, వ్యక్తిగత శుభ్రత, ప్రతిరోజూ వ్యాయామాల పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓలు శ్రీనివాస్, రామశేఖర్ పరిశీలించారు. ఐఈఆర్పీలు ఆర్. నారాయణరావు, ఎం.నాగగోవిందు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



తునిలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు

తుని: నీట్, ఎంసెట్ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలని తుని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేఎల్ఎన్ఎస్ వర్మ ఆకాంక్షించారు. సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు బుధవారం రూ.25 వేలు విలువ చేసే స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం అభినందనీయమని సాంఘిక సంక్షేమశాఖ అధికారి కె.సత్యకుమారి అన్నారు. రోటరీక్లబ్ కార్యదర్శి కె.కిశోర్‌రెడ్డి, సీహెచ్ మంగరాజు, మధుసూదన్, వీర్రాజు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన కారు



జాతీయరహదారిపై తమ్మయ్యపేట వద్ద డివైడర్‌ను ఢీకొట్టిన కారు

తొండంగి: జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి పంచాయతీ తమ్మయ్యపేట వద్ద బుధవారం తెల్లవారుజామున కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లప్రోలుకు చెందిన బి.చంద్రశేఖర్ తన స్నేహితులతో కలిసి కారులో తుని వెళ్లారు. పని ముగించుకుని తిరిగి గొల్లప్రోలు వస్తుండగా తమ్మయ్యపేట వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కారులో ఉన్నవారు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం



కొత్తూరులో తోట నరసింహం, తోట రాంజీలను సత్కరిస్తున్న కరుటూరి వీర్రాజు సోదరులు

జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడం తథ్యమని, దీనికి సిద్ధం బహిరంగ సభలే నిదర్శనమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని కొత్తూరు కరుటూరి వీర్రాజు రైసుమిల్లులో పార్టీ నాయకులతో బుధవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల హృదయాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుస్థిరం స్థానం సంపాదించుకున్నారన్నారు. అందుకే సిద్ధం సభలకు లక్షలాది మంది తరలివస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. అనంతరం మాజీ మంత్రి తోట నరసింహం, ఆయన తనయుడు రాంజీని కరుటూరి వీర్రాజు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, పార్టీ నాయకులు గుల్లా ఏడుకొండలు, జాన్ వెస్లీ, అత్తులూరి సాయిబాబు, ఎస్కే గఫూర్, రామకుర్తి జగాల్, కరుటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ–జనసేన శ్రేణుల మధ్య కొట్లాట ఖాయం

జగ్గంపేట: సీట్ల పంపకంలో టీడీపీ–జనసేన శ్రేణులు కొట్టుకోవడం ఖాయమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని జె.కొత్తూరులో బుధవారం గ్రామ సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఆతీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అన్నారు. ముఖ్యమంత్రి గెలుపు గుర్రాలకే ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పిస్తున్నారని, అందులో తనకు అవకాశం వచ్చిందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుయుక్తులు పన్నినా వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనాన్ని ఆపలేరన్నారు. ఎన్నికలకు రెండు నెలలే సమయం ఉన్నా ఇంకా టీడీపీ–జనసేన మధ్య సీట్లు పంపకం తేలలేదని, టిక్కెట్ల లెక్క తేలితే అసలు సినిమా మొదలవుతుందని ఎద్దేవా చేశారు. ప్రజాదరణతో జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని తెలిపారు. వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, తోట రాంజీ, పార్టీ నేతలు అత్తులూరి సాయిబాబు, గఫూర్, కరుటూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

రౌతులపూడి మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ

రౌతులపూడి: మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు బుధవారం ఆయన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ క్రాంతి పథకం ఏపీఎం సూర్యకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూ.చా. తప్పకుండా అమలు చేశారన్నారు. మహిళ ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మఒడి, విద్యాదీవెన తదితర ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఆసరా పథకంలో మండలంలోని 793 మహిళా సంఘాల్లో అర్హులైన 7,930 మందికి ఏటా రూ.5.15 కోట్లు చొప్పున నాలుగు విడతల్లో రూ.20 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, పార్టీ నేతలు వాసిరెడ్డి జమీలు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు రుత్తల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రౌతులపూడి ఆసరా చెక్కుల పంపిణీ సభలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి
- వాడీవేడిగా మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బుజ్జి అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. సమావేశానికి వచ్చే అధికారులు సమగ్ర సమాచారంతో రావాలన్నారు. మండలంలోని జె.అన్నవరంలో పీహెచ్‌సీ ప్రారంభోత్సవానికి ప్రజాప్రతినిధులను పిలవకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల కృషి ఫలితంగా పీహెచ్‌సీ మంజూరైందన్నారు. అనంతరం వివిధ శాఖల వారీగా ప్రగతిని సమీక్షించారు. దీనిలో భాగంగా ఏఓ జ్యోతి మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా ఆర్బీకేల్లో ఈ–పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ–పంట నమోదు చేసుకుంటేనే రైతులకు ప్రభుత్వ పథకాలు అందుతాయన్నారు. అధికారులు తమశాఖల పని తీరును వివరించారు. అనంతరం 2024–25 ఏడాదిగానూ రూ.32,27,19,100 ఆదాయం, రూ.32,27,04,600 వ్యయంతో మిగులు బడ్జెట్‌ను ఆమోదించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్, జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మీ దేవి, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

- నియోజకవర్గంలో 45 కేంద్రాలు అత్యంత సమస్యాత్మకం
- వివరాలు వెల్లడించిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అధికారులు గుర్తించారు. నియోజకవర్గంలోని 14 గ్రామాల్లో 45 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్టు జిల్లా బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఏలేశ్వరం మండలంలో లింగంపర్తి, పెద్దనాపల్లి, తిరుమాలి గ్రామాల్లోని 17 పోలింగ్ కేంద్రాలు, ప్రత్తిపాడు మండలంలోని చిన శంకర్లపూడి, బురదకోట, ఏలూరు, ఒమ్మంగి గ్రామాల్లోని 9 కేంద్రాలు, శంఖవరం మండలంలోని శంఖవరం, మండపం, కత్తిపూడి గ్రామాల్లోని 9 కేంద్రాలు, రౌతులపూడి మండలంలోని పారుపాక, ఎస్.అగ్రహారం, ములగపూడి, ఎస్.పైడిపాల గ్రామాల్లోని 10 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించినట్టు చెప్పారు. ఈ సమస్యాత్మక గ్రామాలతో పాటు నియోజకవర్గవ్యాప్తంగా 139 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక నిఘా (వెబ్ కాస్టింగ్) ఏర్పాటు చేస్తామన్నారు.

12,725 అర్జీలు

నియోజకవర్గంలో కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణల కోసం 12,725 అర్జీలు దాఖలు కాగా వాటిలో 11,963 అర్జీలు పరిష్కరించామన్నారు. ఇంకా 762 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాలు, ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో కొత్త ఓటరు నమోదు (ఫారం–6)కు 6,520 దరఖాస్తులు రాగా వాటిలో 6,070 దరఖాస్తులను పరిష్కరించి, 450 పెండింగ్‌లో ఉంచామన్నారు. ఫారం–7 కోసం 3,077 దరఖాస్తులు రాగా 2,979 పరిష్కరించి, 98 పెండింగ్‌లో ఉంచామన్నారు. సవరణల (ఫారం–8) కోసం 3,128 అర్జీలు రాగా వాటిలో 2,914 పరిష్కరించి, 214 పెండింగ్‌లో ఉంచామని వివరించారు. సమావేశంలో ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ కె.శివప్రసాద్, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి తహసీల్దార్లు ఎస్.నరసింహరావు, వై.రంగారావు, వి.రాజకుమారి, ఎం.శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) టి.శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, ధరణాలకోట శ్రీను, మానుకొండ లచ్చబాబు, రొంగల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో జగనన్న ఆరోగ్య సురక్ష



ఏలేశ్వరంలో రోగులకు ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలో బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్ దళే కిషోర్, మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని 2, 12 వార్డుల్లో రోగులకు డాక్టర్ పాపారావు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత జామి ఆదినారాయణ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సేవలను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ రాజు

గోకవరం: బీఎస్ఎన్ఎల్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ పి.రాజు అన్నారు. మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాల ఆవరణలో బుధవారం బీఎస్ఎన్ఎల్ 4జీ టవర్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బి.రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి పోటీ ప్రపంచంలో ఇంటర్నెట్ ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణంతో ఇంటర్నెట్ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో డీజీఎం రాజశేఖర్‌బాబు, ఏజీఎంలు రఘురామ్, శ్రీనివాస్, ఈఈ సురేంద్ర, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రత్నకుమార్, ట్రెజరర్ అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గౌరంపేటలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



గౌరంపేటలో జేసీబీతో వ్యర్థాల తొలగింపు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని గౌరంపేట సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు అన్నారు. మండలంలోని గౌరంపేటలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏసుబాబు మాట్లాడుతూ పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

దరఖాస్తుల స్వీకరణ

జగ్గంపేట: కాట్రావులపల్లిలోని పానుగంటి లక్ష్మీవెంకయ్యమ్మ ధర్మ సత్రం ట్రస్టుబోర్డు ఏర్పాటుకు సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సత్రం ఈఓ శర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.విజయరాజు ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఏలేశ్వరం ఎంపీడీఓగా అరుణ



ఏలేశ్వరం: మండల ఎంపీడీఓగా వి.అరుణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా పరిషత్ నుంచి ఆమె ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ప్రేమ్‌సాగర్ రౌతులపూడి ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. గతంలో ఎంపీడీఓ అరుణ ఇక్కడకు బదిలీపై రాగా వివాదాస్పదమైంది. దీంతో ఆమె జిల్లా పరిషత్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లిపోగా తిరిగి ఇక్కడకే బదిలీపై వచ్చారు.

పాడుబడిన బావిలో మృతదేహం లభ్యం

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం చెరువులో ఉన్న పాడుబడిన బావిలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సుమారు నెల రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి దాదాపు 60 అడుగుల లోతు గల బావిలో పడిపోయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. బావి నుంచి దుర్వాసన రావడంతో వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్వామివారికి 21 ద్రవ్యాలతో అభిషేకం



బసవేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి క్షేత్రంలో బసవేశ్వరస్వామికి బుధవారం 21 ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పండితులు స్వామివారిని ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు. ఏలేశ్వరానికి చెందిన చిట్టంశెట్టి పుల్లయ్య, నాగమల్లేశ్వరి దంపతులు, హైదరాబాద్‌కు చెందిన దాట్ల గణేష్ శంకర్ పద్మకాంత్, దాట్ల వెంకట దుర్గాజ్ఞానకుమార్, దాట్ల మంగపతి రాజు తదితరులు స్వామివారికి పూజలు చేశారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ పీఠాధిపతి స్వామి రామానంద పర్యవేక్షించారు.

16న భారత్ బంద్

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న భారత్ బంద్ చేస్తున్నట్టు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్ తెలిపారు. స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో బుధవారం జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి సీపీఐ పట్టణ కార్యదర్శి పెదిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. బంద్‌ను విజయవంతం చేయాలని రవీంద్రనాథ్ కోరారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మికుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పడాల రమణ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తోకల ప్రసాద్, కాకినాడ జిల్లా సీపీఐ కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, ప్రజానాట్య మండలి నాయకులు మడగల రమణ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంలో 97 శాతం పనిదినాలు పూర్తి



అచ్యుతాపురంలో జలకళ పథకంలో వేసిన బోరును పరిశీలిస్తున్న డ్వామా పీడీ ముఖలింగం

గోకవరం: మండలవ్యాప్తంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 97 శాతం పనిదినాలను పూర్తి చేసినట్టు డ్వామా పీడీ ఎ.ముఖలింగం తెలిపారు. అచ్యుతాపురం పంచాయతీ పరిధిలోని అంబటి వాని చెరువు, రూఫ్ టాప్ హార్వెస్టింగ్, బ్లాక్ ప్లాంటేషన్, వైఎస్సార్ జలకళ పథకంలో వేసిన బోరులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వచ్చే ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులను గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో 5.10 లక్షలు పనిదినాలు కల్పించాల్సి ఉండగా ఇప్పటి వరకు 4.98 లక్షల పనిదినాలు కల్పించామన్నారు. మిగిలిన పనిదినాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీఓ బి.రాంప్రసాద్, ఏపీఓ పీఎస్ అప్పలరాజు, జేఈ రత్నరాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

లంపకలోవ సొసైటీ అధ్యక్షుడిగా హరిబాబు



ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) అధ్యక్షుడిగా పెద శంకర్లపూడి గ్రామానికి చెందిన దళే వెంకట శ్రీనివాసప్రభాకరరావు (హరిబాబు) నియమితులయ్యారు. 1990లో పెదశంకర్లపూడి సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన హరిబాబుకు వీఆర్వో ఉద్యోగం రావడంతో సొసైటీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుతం సొసైటీ త్రిసభ్య కమిటీకి చైర్‌పర్సన్‌గా దళే హరిబాబును నియమిస్తూ రాష్ట్ర సహకార సొసైటీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా సహకార అధికారి (డీసీఓ) బీకే దుర్గాప్రసాద్ నియామక ఉత్తర్వులు ఇచ్చారు. త్రిసభ్య కమిటీ సభ్యులుగా పి.వీరభద్రరావు, జి.అర్జున్ కుమార్ నియమితులయ్యారు. సొసైటీ చైర్మన్‌గా నియమితులైన దళే హరిబాబుకు జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ బెహరా దొరబాబు అభినందనలు తెలిపారు.

టీడీపీ ఇంటింటా ప్రచారం

ప్రత్తిపాడు: స్థానిక కొత్తపేటలో బుధవారం టీడీపీ శ్రేణులు భవిష్యత్తుకు గ్యారంటీ – బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బాలల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం



గండేపల్లిలో నులిపురుగుల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు



గోకవరం ప్రభుత్వ పాఠశాలలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



ఏలేశ్వరంలో వైద్య సిబ్బందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

గండేపల్లి: బాలల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ చలగళ్ల దొరబాబు అన్నారు. ఈ నెల 9న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్. హనుమంతరావు, వైద్యులు కేవీ నరేష్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి

ఏలేశ్వరం: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జెడ్పీటీసీ సభ్యురాలు నీరుకొండ రామకుమారి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ వైద్యురాలు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాలల హెచ్‌ఎంలకు ఎంపీపీ, జెడ్పీటీసీ చేతులమీదుగా నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల ఆరోగ్యంగా ఉండాలంటే నులి పురుగులను నివారించాలన్నారు. వైద్యురాలు శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలోనూ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై కరపత్రాల పంపిణీ

గోకవరం: మండల వ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కొత్తపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తిరన్ అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో వైద్య సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా కృషి చేయాలని కోరారు. అనంతరం వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓలు మూర్తి, శంకర్, హెల్త్ అసిస్టెంట్లు పవన్, రమణ, శ్రీను, అప్పారావు, రాజు, నాగేశ్వరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డీ వార్మింగ్ డే ను విజయవంతం చేయాలి

తొండంగి: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ పసుపులేటి సతీష్ కోరారు. మండలంలోని ఏవీ నగరం, తొండంగి, రావికంపాడు, కేపీ పురం పీహెచ్‌సీల వైద్యులు పి.రవికుమార్, భారతి, అర్చన, రవి, వైద్య సిబ్బందికి బుధవారం ఆయన ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.